క్లుప్తంగా

సజావుగా ధాన్యం కొనుగోళ్లు



కొనుగోళ్లు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ స్వరూప

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తూ సజావుగా కొనుగోళ్లు సాగుతున్నాయని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప అన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో శుక్రవారం ఆమె ధాన్యం కొనుగోళ్లను పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయనేందుకు గత రెండేళ్ల కన్నా ఈసారి ఇంకా తూకం వేయడమే నిదర్శనమన్నారు. కానీ బీజేపీ నాయకులు ఇవేమీ పట్టించుకోకుండా రాజకీయంగా ఉనికి చాటుకోవాలన్న ఆలోచనతో అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వైస్ చైర్మన్ మల్లారెడ్డి, డైరెక్టర్లు మ్యాడగోని శ్రీనివాస్, గౌస్‌మియా తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం



మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి ఆరోపించారు. పెద్దపల్లిలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని తూకం వేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సన్నరకం ధాన్యాన్ని తీసుకునేందుకు మిల్లర్లు విముఖత చూపుతూ క్వింటాల్‌కు రూ.20కోత పెడుతున్నారని ఆరోపించారు. పాలక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం, అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అందాల పోటీల నిర్వహణపై కాంగ్రెస్ సర్కారుకు ఉన్న శ్రద్ధ అన్నదాతల సంక్షేమంపై లేకపోవడం విచారకరమన్నారు. బీజేపీ సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కట్కూరి సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొల్లూరి కుమార్, రేండ్ల వేణు ఉన్నారు.

సబ్సిడీపై జనుము, పచ్చిరొట్ట విత్తనాలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గ్రామాలకు సబ్సిడీపై జనుము, పచ్చిరొట్ట విత్తనాలను అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.సతీశ్ తెలిపారు. 40 కేజీల బస్తా 2.20 ఎకరాల విస్తీర్ణానికి సరిపోతుందని, దాని పూర్తి బస్తా ధర రూ.5,020, సబ్సిడీ తొలగిస్తే రూ.2,510 చెల్లించి తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. బ్రాహ్మణపల్లి, గోలివాడ, అంతర్గాం, ముర్మూర్, ఎల్లంపల్లి, రాయదండి, లింగాపూర్ గ్రామ రైతులు బ్రాహ్మణపల్లి రైతు వేదికలో ఏఈవో పర్మిట్ తీసుకొని డీసీఎంఎస్‌లో బస్తాలు పొందవచ్చన్నారు. ఎగ్లాస్‌పూర్, ఆకెనపల్లి, సోమనపల్లి, పొట్యాల, మద్దిర్యాల, కుందనపల్లి గ్రామస్తులు సోమనపల్లి రైతువేదిక వద్ద ఏఈవో పర్మిట్ తీసుకోవాలని సూచించారు. వివరాలకు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

30వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న సాయికిషోర్

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని ఐతరాజుపల్లికి చెందిన మద్ది సాయికిషోర్ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. శుక్రవారం కరీంనగర్‌లోని భద్రకాళి ఆసుపత్రిలో రామగుండంకు చెందిన సుజాతకు సర్జరీ కోసం రక్త అవసరమైంది. సమాచారం తెలిసిన సాయికిషోర్ వెళ్లి రక్తదానం చేశారు. ఇప్పటివరకు 30సార్లు రక్తదానం చేసినట్లు అతను తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి

కాల్వశ్రీరాంపూర్: మండలంలో సంకష్ట చతుర్థి వేడుకలను శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాస దీక్షలతో విఘ్నేశ్వరునికి అభిషేకాలు, అర్చనలు, ఉండ్రాళ్లు, ముఖ్యంగా గరికతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసారి సంకష్ట చతుర్థి శుక్రవారం కలిసి రావడంతో గణపతితోపాటు లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని భక్తులు నిష్ఠతో పూజలు చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పిల్లిపల్లెలో విద్యుత్ తీగలు చెట్లకొమ్మలను తాకుతూ ప్రమాదంగా మారాయి. గాలివానకు చెట్లకొమ్మలకు విద్యుత్ తీగలు తాకి విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు అంటున్నారు. సంబంధింత శాఖ సిబ్బంది చెట్లకొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా వాటర్ ప్లాంటు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం రాజీవ్ రహదారిని అనుకుని ఉన్న ఉచిత నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటు నిరుపయోగంగా మారింది. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా రాజీవ్ రహదారి బస్‌షెల్టర్ పక్కన ఉన్న వాటర్ ప్లాంటు ప్రయాణికుల దాహార్తి తీర్చడంతో పాటు సమీప కాలనీవాసులకు నీటిని అందించేందుకు బాల వికాస ట్రస్టుకు ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ నిధులు కేటాయించడంతో నిర్మించారు. ఏర్పాటు చేశారు కానీ ఇంతవరకు ప్రారంభించలేదు. బస్‌షెల్టర్ పక్కన లక్షల రూపాయలతో బోర్‌వెల్‌తో పాటు విద్యుత్ కనెక్షన్, గది నిర్మించినా నిరుపయోగంగా ఉంది. సంబంధిత విభాగం స్పందించి వాటర్‌ప్లాంట్ ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్దపల్లిరూరల్: పాలకుర్తి మండలం జీడీనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ కూలడంతో మురుగునీటి సరఫరా జరగక దుర్వాసన వెదజల్లుతోందని కాలనీకి చెందిన ఉదయ్‌కుమార్ తదితరులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని తెలిపారు. ఇప్పటికైనా చర్యలు తీసుకునేలా అధికారులు దృష్టిసారించాలని వారు కోరుతున్నారు.



వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

గొర్రెల పెంపకందారులు ఆర్థికంగా ఎదగాలి

- ఎమ్మెల్యే విజయరమణారావు,
  ఐకార్ డైరెక్టర్ బర్‌బుద్దే



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: గొర్రెల పెంపకందారులు శాస్త్రీయ పద్ధతిన గొర్రెలు పెంచాలని ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. స్థానిక అమర్‌చంద్ కల్యాణ మండపంలో శుక్రవారం జాతీయ మాంస పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు పెంపకందారులకు అవగాహన కల్పించారు. ఐకార్ డైరెక్టర్ బర్‌బుద్దే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, మాంసం ఉత్పత్తులు పెంచడం ద్వారా అధిక ఆదాయం ఆర్జిస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. పశుసంవర్ధకశాఖ శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రెడ్డి, శంకర్ తదితరులు అవగాహన కల్పించారు. పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం, నాయకులు మారం తిరుపతి, చిలారపు పర్వతాలు, గంట రాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు చేయూత

జూలపల్లి: గ్రామాల్లో పరిశ్రమలు స్థాపించి, పేద కుటుంబాలకు ఉపాధి కల్పించే యూనిట్లకు ప్రభుత్వం చేయూత ఇస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రీకేశవ గణపతి ఎకో పాల్యూషన్స్ ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధికి పరిశ్రమలు స్థాపించుకోవాలని సూచించారు. ఈక్రమంలోనే ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఉపాధి కల్పిస్తోందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గండు సంజీవ్, పీఏసీఎస్ చైర్మన్ వేణుగోపాలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, పరిశ్రమ భాగస్వాములు నూతి చంద్రయ్య, గంగుల ఆవినాష్‌రెడ్డి, గుడిపాటి మహేందర్, గున్నాల భాస్కర్ ఉన్నారు.

ప్రజాస్వామ్య పోరాటంతోనే వెలుగులు తీసుకురావాలి



మాట్లాడుతున్న పుట్ట మధు

కమాన్‌పూర్: ప్రజాస్వామ్య పోరాటంతోనే మంథని నియోజకవర్గంలో మళ్లీ వెలుగులు తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మండలంలోని రొంపికుంటలో పుట్ట మధు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రజాస్వామ్య పోరాట లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో అలుముకున్న చీకట్లను తొలగించడానికి చేపడుతున్న ప్రజాస్వామ్య పోరాట కార్యక్రమాన్ని రొంపికుంట నుంచి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నాయకులు పుట్ట శైలజ, జక్కు వర్శిని, తాటికొండ శంకర్, ఉప్పరి శ్రీనివాస్, కొండ వెంకటేశ్, చిందం తిరుపతి, లక్ష్మి మల్లు, అనిల్, సాయికుమార్, రాజేశ్వరి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

రామగిరి: మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు జన్మదిన వేడుకలు శుక్రవారం లద్నాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. గ్రామశాఖ అధ్యక్షుడు తుమ్మల అశోక్ అధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మండల అధ్యక్షుడు శంకేశి రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొని కేక్ కట్ చేశారు. అలాగే కల్వచర్లలో గ్రామ శాఖ అధ్యక్షుడు జాపతి శేఖర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. సెంటినరికాలనీ టౌన్ అధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి బర్ల కుమార్, నాయకులు రోడ్డ శ్రీనివాస్, బడికల శ్రీనివాస్, మేడగోని రాజన్న, ఆసం తిరుపతి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• తహసీల్దార్ ఎదుట బైండోవర్

ముత్తారం: మండలంలోని లక్కారం, కాజిపల్లి గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్న తిరుపతి, ఓ మహిళను పట్టుకున్న అబ్కారీశాఖ ఎస్సై సాయికుమార్ శుక్రవారం ముత్తారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. గ్రామాల్లో నాటుసారా అమ్ముతున్న వారిద్దరికీ రూ.లక్ష జరిమానాతో పాటు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

• పాఠశాలల్లో సమావేశం

ఎలిగేడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పీటీఎం సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ప్రణాళికపై చర్చలు జరిపి అవగాహన కల్పించారు. ఈనెల 16 నుంచి 29 వరకు 5ఏళ్లు ఆపై వయస్సు కలిగిన బడీడు పిల్లలను గుర్తించి, డ్రాప్ అవుట్‌లు, కళాశాల డ్రాప్ అవుట్‌లు, నిరక్షరాస్యులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను వేరు, వేరు కేటగిరీలుగా గుర్తించి వారి వివరాలతో కూడిన పూర్తి నివేదికను ఈనెల 30లోగా తప్పనిసరిగా కార్యాలయాల్లో అందజేయాలని ఎంఈవో నరేంద్రచారి, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం దేవేందర్‌రావు ఆదేశించారు.

• విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

మంథని: మండలంలోని నాగెపల్లి శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌వైర్‌కు తగిలి ఆవు మృత్యువాత పడింది. శుక్రవారం మేతకోసం వెళ్లిన ఆవు విద్యుత్ ప్రమాదానికి గురై మృత్యువాత పడినట్లు బాధితుడు బొమ్మ శ్రీనివాస్ తెలిపాడు. పాడి ఆవు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని, అధికారులు ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

• తప్పిన పెను ప్రమాదం

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని స్వప్నకాలనీ బోర్డు వద్ద గల రాజీవ్ రహదారిపై శుక్రవారం లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ నుంచి మంచిర్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్‌కు రాగానే ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. దీంతో బస్సు ముందు భాగం ధ్వంసం కాగా ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

• బడిబాట అవగాహన ర్యాలీ

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్ల చిన్నారులను సర్కారు బడికి పంపించాలని కోరారు. హెచ్‌ఎంలు రాజారాం, సునీత, ఏపీఎం కనుకయ్య, స్వశక్తి మహిళా గ్రూపు సభ్యులు , గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• బడీడు పిల్లలను బడిలో చేర్పించండి

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలని ఎంఈవో రాజయ్య కోరారు. ప్రభుత్వం పేరెంట్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరడంతో పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు.

• ఫైనాన్స్ బ్రాంచ్‌లు ఎత్తివేత.. ఒకరిపై కేసు నమోదు

మంథని: శ్రీబాలాజీ అసోసియేట్స్ చైర్మన్ దోమల రమేశ్ అనే వ్యక్తి ఫైనాన్స్ బ్రాంచ్‌లు ప్రారంభించి లోన్ కోసం డబ్బులు వసూలు చేసి బ్రాంచ్‌లు ఎత్తివేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మంథని ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం పెద్దపల్లి, గోదావరిఖని, మంథనిలో ఫైనాన్స్ బ్రాంచ్‌లు ప్రారంభించి ఉద్యోగులను నియమించుకున్నారు. వారి ద్వారా కస్టమర్లకు లోన్లు ఇప్పించడానికి లాగిన్ అమౌంట్ రూ.5,100, లోన్ ఇప్పించినందుకు గాను ప్రాసెసింగ్ ఫీజు లక్షకు రూ.3300 ముందుగానే వసూలు చేసినట్లు పేర్కొన్నారు. కాగా అట్టి బ్రాంచ్‌ల్లో పెద్దపల్లి, గోదావరిఖని బ్రాంచీలను ఎత్తివేసి, మంథనిలో కస్టమర్ల లోన్ అమౌంట్ ఇవ్వకుండా, ఉద్యోగులకు గత 2, 3 నెలల నుంచి జీతాలు చెల్లించలేదన్నారు. కస్టమర్లను మోసం చేసి డబ్బులు వసూలు చేసిన సదరు వ్యక్తిపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• అసభ్యకర పోస్టులు.. వ్యక్తికి జైలు శిక్ష

గోదావరిఖనిటౌన్: ఫేస్‌బుక్‌లో పాలకుర్తి మాజీ జెడ్పీటీసీ కందుల సంధ్యారాణిపై అసభ్యకర పోస్టులు వైరల్ చేసిన కేసులో లింగాపూర్ గ్రామానికి చెందిన నిమ్మరాజుల రవికి 4నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ గోదావరిఖని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట సచిన్‌రెడ్డి శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2020 మార్చి 30న అప్పటి పాలకుర్తి జెడ్పీటీసీ, లింగాపూర్ గ్రామానికి చెందిన కందుల సంధ్యారాణిని ఉద్దేశించి నిమ్మరాజుల రవి అసభ్యకరంగా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. దీనిపై ఆమె 2020 మార్చి 31న అప్పటి అంతర్గాం ఎస్సై రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ నాగరాజు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా.. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నహీద ఫర్వీన్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేశారు.

నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత



ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: నిరుపేద కుటుంబానికి రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అండగా నిలిచారు. స్థానిక 35వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన ఇంటిని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. నిరుపేద కుటుంబానికి చెందిన గురిశెట్టి శ్యామల–శంకర్ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే ముందుండి ఇంటిని నిర్మించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేద కుటుంబాన్ని చేరదీసినట్లు ఆయన పేర్కొన్నారు. సమాజంలో ప్రతీ ఒక్కరికి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని, ఇల్లు అనేది ప్రతి మనిషి హక్కు అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాల్లో ఎమ్మెల్యే దంపతులు



గోదావరిఖని: సరస్వతి నది పుష్కరాల్లో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ దంపతులు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి కాళేశ్వరం వద్ద జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పుష్కర స్నానం చేశారు.

ఈటల జోలికివస్తే ఊరుకోం

గోదావరిఖని: పార్లమెంట్ సభ్యుడు, ఉద్యమకారుడు ఈటల రాజేందర్ జోలికి వస్తే ఊరుకోబోమని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడుగు కృష్ణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎంపీపై వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదన్నారు. పేదల పక్షాన ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తూనే ఉంటాయన్నారు. సమావేశంలో నాయకులు పిల్లి శివయ్య, దబ్బెట శంకర్, అప్పరాజు ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు పార్కు పనులకు శంకుస్థాపన

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ50.50 లక్షలతో చేపట్టనున్న పార్కుల అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేయనున్నారు. ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్, నగరపాలక స్పెషలాఫీసర్, కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొంటారని కమిషనర్ జె.అరుణశ్రీ తెలిపారు. గోదావరిఖనిలోని దుర్గానగర్ పార్కు, ఇతర పార్కుల అభివృద్ధి, నిర్వహణ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి పెద్దబొంకూర్, పెద్దకల్వల, నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దపల్లి, రంగంపల్లిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మరమ్మతు పనుల కారణంగా ఉదయం 7:30గంటల నుంచి 9 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సీఎస్ఆర్ నిధులు కేటాయించాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామంలో ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 8వ కాలనీకి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి నిర్మించాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి కందుల సతీశ్ కోరారు. శుక్రవారం ఆర్జీ–2 జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు.

పందులను ఊరికి దూరంగా పెంచాలి



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లిరూరల్: పట్టణంలో పందుల సంచారం లేకుండా పెంపకందారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ ఆదేశించారు. పెద్దపల్లిలో శుక్రవారం పందుల పెంపకందారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో పందులను జనావాసాల నడుమ పెంచుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. అలాంటి పెంపకందారులు సత్వరమే ఊరికి దూరంగా వాటిని తరలించి పెంచుకోవాలని సూచించారు. లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వార్డు ఆఫీసర్లు అనిల్, ప్రదీప్, సుధీర్, అనూష ఉన్నారు.

సింగరేణి వార్తలు

మెగా జాబ్ మేళా ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: నగరంలో ఈనెల 18న నిర్వహించే మెగా జాబ్‌మేళాను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్జీ–1 జీఎం డి.లలిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోకి వచ్చే వారికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మేళాలో 80 నుంచి 100 ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని, వారి ప్రతినిధులు కూడా హాజరు కానున్నట్లు తెలిపారు. అన్ని రకాల వసతులు, ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో క్వాలిటీ జీఎం భైద్య, ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు, సింగరేణి అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలంలోని ముస్త్యాల గ్రామస్తులకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ లావణ్య అన్నారు. సింగరేణి ప్రభావిత గ్రామమైన ముస్త్యాల గ్రామానికి ఆర్జీ–1 సింగరేణి యజమాన్యం మంజూరు చేసిన బోర్‌వెల్‌ను శుక్రవారం సింగరేణి అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు కృష్ణ, యాదగిరి, విజేందర్‌రెడ్డి, శ్రావణ్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లిలో ర్యాలీ



రామగుండం: ర్యాలీలో వైద్యసిబ్బంది

సుల్తానాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని గర్రెపల్లి పీహెచ్‌సీ వైద్యుడు ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని గర్రెపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఈవో అనీసోద్దిన్, పీహెచ్ఎన్ భారతి పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్, తేలుకుంట, వడ్కాపూర్, వెంకట్రావుపల్లె గ్రామాల్లోని ఆయుష్మాన్ భారత్ సెంటర్ల పరిధిలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి ఉన్నారు.

ముత్తారం: ముత్తారం పీహెచ్‌సీలో వైద్యుడు అమరేందర్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్ఎన్ గ్రేస్‌మణి, స్టాఫ్‌నర్సు రవళి, ఝాన్సీ, ఎల్‌టీ అనిల్, ఫార్మాసిస్ట్ జగదీశ్, ప్రవంతి, రమాదేవి, దుర్గమ్మ, కళావతి, సునీత, దీప్తి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి సల్మా, సీహెచ్‌వో శ్రీనివాసరెడ్డి, పీహెచ్ఎన్ లలిత, బాలభారతి, పురుషోత్తం, శ్రీలత పాల్గొన్నారు.

రామగుండం: టీటీఎస్ అంతర్గాం, ముర్మూర్ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అంతర్గాం మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్, అంతర్గాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధి ఎలిగేడు ప్రధాన కూడలిలో, ధూళికట్ట, సుల్తాన్‌పూర్‌లో ర్యాలీలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, సూపర్‌వైజర్ లక్ష్మన్, నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ వినయ, డాక్టర్ సింధూర, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తా, వివిధ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, సీహెచ్‌వో సరస్వతి, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, హెచ్ఈవో శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ నీరజ, ఏపీఎం కనుకయ్య పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని నందిమేడారం ప్రాథమిక ఆరోగ్యం వైద్యాధికారి డాక్టర్ అనుదీప్, సుష్మిత ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా అధికారి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర జయప్రదం చేయండి

సుల్తానాబాద్: పట్టణంలో ఈనెల 18న నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజుయాదవ్ కోరారు. పట్టణంలోని పెరుకగిద్దె హనుమాన్ ఆలయంలో శుక్రవారం ఆయన హనుమాన్ మాలధారులతో కలిసి మాట్లాడారు. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా హనుమాన్ మాల ధరించిన అంజన్నస్వాములు అందరూ కలిసి స్వచ్ఛందంగా వారి సొంత ఖర్చులతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. శివాలయం నుంచి ప్రారంభమై సుల్తానాబాద్ పురవీధుల్లో రథంపైన హనుమాన్ ఉత్సవ మూర్తి విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శోభాయాత్రలో హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.